

ఓ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు



మృతుడు ప్రవీణ్





మృతులు జగదీశన్, సురేష్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

# కల్తీసారాకు 13 మంది బలి

- తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం
- కలెక్టర్ బదిలీ, ఎస్పీ సస్పెన్షన్

## కళ్లకుర్చి జిల్లాలో ఘోరం ● ఆసుపత్రుల్లో మరో 60 మంది

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లాలో కల్తీ సారా రక్కసి కాటేసింది. మత్తుకు బానిసలైన 13మందిని బలి తీసుకుంది. అంతేగాక మరో 60 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, ఇందులో ఐదుగురి పరిస్థితి విషమంగా వుంది. దీనిపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం జిల్లా ఎస్పీపై సస్పెన్షన్‌పై వేటు వేయడంతో పాటు జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేసింది. అంతేగాక అనారోగ్యంపాలైన వారిని కాపాడేందుకు 18మందితో కూడిన ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపిన ఈ ఘటన వివరాలిలా వున్నాయి...

కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో కొంతకాలంగా వ్యాపారులు పోలీసుల కళ్లుగప్పి కల్తీసారాను విక్రయిస్తున్నారు. మంగళవారం రాత్రి కూలీపనులు చేసే సుమారు 70 మంది కల్తీసారా కొనుగోలు చేసి సేవించారు. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజామున వీరంతా వాంతులు చేసుకుని, తలనొప్పి, కళ్ళలో, కడుపులో మంటలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఒకే వీధికి చెందిన 15 మంది వున్నారు. బాధితులందరినీ చికిత్స నిమిత్తం కళ్లకుర్చి, సేలం, విల్లుపురం, పుదుచ్చేరి, తిరుచ్చిలలోని ఆసుపత్రులకు తరలించారు. ఆయా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ప్రవీణ్ (29), సురేష్ (46), శేఖర్ (77) జగదీశన్ సహా 13మంది మృతి చెందారు. మృతుల్లో ఒక మహిళ కూడా వుంది. మరో ఐదుగురి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

### శోకసంద్రంలో కరుణాపురం

కరుణాపురంలో ఒకేసారి 13 మంది మృతి చెందడంతో ఆ ప్రాంతం శోకసంద్రంలా తయారైంది. ఎటు చూసినా రోదనలు, వేదనలతో ఆ ప్రాంతం విషాదంలో మునిగిపోయింది. రాత్రి ఆడుతూ పాడుతూ తిరిగిన తమ వారంతా తెల్లవారేసరికి ఆసుపత్రిపాలై కన్నుమూయడంతో ఆయా కుటుంబాల దుఃఖానికి అంతులేకుండాపోయింది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు. కాగా మెథనాల్ అధికంగా వుండడమే ఇంతమంది చావుకు కారణమని వైద్యశాఖ వర్గాలు తెలిపాయి.

### ఈపీఎస్, అన్నామలై ఆగ్రహం...

కరుణాపురంలో కల్తీసారాకు కూలీ కార్మికులు మృతి చెందటం పట్ల అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అన్నామలై వేర్వేరు ప్రకటనలలో పాలకపక్షంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంకే ప్రభుత్వ చేతగానితనం వల్లే రాష్ట్రంలో కల్తీసారా జోరుగా విక్రయిస్తున్నారని, నిరుపేద కూలీ కార్మికులు కల్తీసారా తాగి మృతి చెందటం శోచనీయమని, మృతుల కుటుంబీకులకు పార్టీ తరఫున సంతాపం ప్రకటిస్తున్నానని ఈపీఎస్ తన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కల్తీసారా ఏరులై ప్రవహిస్తోందని, మాదక ద్రవ్యాలు స్వేచ్ఛగా విక్రయిస్తున్నారని తమ పార్టీ ఎన్నిసార్లు ఆరోపించినా ముఖ్యమంత్రి స్టాలిన్ పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఈపీఎస్ ఆరోపించారు. కల్తీసారా తాగి అమాయక ప్రజలు మృతి చెందినప్పుడల్లా పాలకులు 'కల్తీసారా కాదు అది మెథనాల్' అంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం పరిపాటిగా మారిందన్నారు. అన్నామలై జారీ చేసిన ప్రకటనలో.. కల్తీసారా తాగి కార్మికులు మృతి చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. మరకాణం, మధురాంతకం ప్రాంతాల్లో కల్తీసారాకు 23 మంది మృతి చెందిన సంఘటన జరిగిన ఏడాదికే మళ్ళీ రాష్ట్రంలో కల్తీసారాకు ఇంతమంది బలికావడం గర్హనీయమని పేర్కొన్నారు. కల్తీసారా వ్యాపారులకు డీఎంకే ప్రభుత్వం అండగా ఉండటం వల్లే ఇలా అమాయక జీవులు కల్తీసారా తాగి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. కల్తీసారా వ్యాపారులకు మంత్రి మస్తాన్ అండగా ఉండటం వల్లే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ సంఘటనకు బాధ్యులైన మంత్రులు సెంజి మస్తాన్, ముత్తుసామిని పదవుల నుండి డిస్మిస్ చేయాలని అన్నామలై డిమాండ్ చేశారు.

### అనారోగ్యం వల్లే మృతి - కలెక్టర్

కళ్లకుర్చి జిల్లా మృతులకు కల్తీసారా కారణంగా కాదని జిల్లా కలెక్టర్ శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన చేశారు. కల్తీసారా తాగడం వల్లనే వారు మరణించినట్లు వైద్యులుగానీ, కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్న పోలీసులు గానీ నిర్ధారించలేదని ఆయన వివరణ ఇచ్చారు. మూర్ఛవ్యాధి, దీర్ఘకాలి రోగం తదితర అనారోగ్య కారణాల వల్లే వారు మృతి చెంది ఉంటారని తెలిపారు.

### కలెక్టర్, ఎస్పీపై వేటు

ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. కల్తీసారా అమ్మకాల గురించి తెలిసి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు కార్మికుల మృతికి ఇతర అనారోగ్యకారణాలంటూ కాకమ్మ కబుర్లు చెప్పిన కలెక్టర్ శ్రవణ్‌కుమార్‌ను బదిలీ చేసింది. అంతేగాక కల్తీసారాను అడ్డుకోవడంలో విఫలమైన జిల్లా ఎస్పీ సమయసింగ్ మీనాను సస్పెండ్ చేసింది. అంతేగాక జిల్లా నూతన కలెక్టర్‌గా ఎంఎస్ ప్రశాంతను, జిల్లా ఎస్పీగా రజత్ చతుర్వేదిని నియమించడంతో పాటు తక్షణం విధుల్లో చేరి, పరిస్థితిని చక్కదిద్దాలని ఆదేశించింది. అంతేగాక రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తదితరులను తక్షణం ఘటనా స్థలికి వెళ్లి మృతుల కుటుంబాలను ఓదార్చడంతో పాటు ఆసుపత్రుల్లో మృత్యువుతో పోరాడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించి, వారిని రక్షించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. జరిగిన ఘటన పట్ల సీఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంతేగాక ఈ కేసు దర్యాప్తును సీబీసీఐడీకి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా ఆ జిల్లాలో వున్న ఎక్సైజ్ విభాగ పోలీసులందరినీ అక్కడి నుంచి బదిలీ చేస్తున్నట్లు ప్రకటించారు.

### విచారణకు ఆదేశించాం : డీజీపీ

కళ్ళకుర్చిలో ఇంతమంది కార్మికులు మృతి సంఘటనపై విచారణకు ఆదేశించినట్లు డీజీపీ శంకర్ జివాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన జారీ చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితర పోలీసు ఉన్నతాధికారులు ఆ సంఘటనపై సమగ్రమైన విచారణ జరుపుతున్నారని ఆ విచారణ పూర్తయిన తర్వాతే వారి మృతికి గల కారణాలు వెల్లడవుతాయన్నారు.

### ఇరువురి అరెస్టు...

కల్తీసారాకు ఐదుగురు మృతి చెందిన సంఘటనకు సంబంధించి పోలీసులు ఇరువురిని అరెస్టు చేశారు. ఈ సంఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆ ప్రాంతంలో కల్తీసారా విక్రయించిన వ్యాపారి గోవిందరాజన్ అలియాస్ కన్నుకుట్టి సహా ఇరువురిని అరెస్టు చేశారు. వారి వద్ద 200 లీటర్ల కల్తీసారాను స్వాధీనం చేసుకుని, వారి వద్ద తీవ్ర విచారణ జరుపుతున్నారు. కాగా ఒకేసారి ఇంతమంది ఎలా కల్తీసారా సేవించారన్నదానిపై పోలీసులు తీవ్రంగా ఆరా తీస్తున్నారు.





పార్టీ రాష్ట్ర నిర్వాహకులతో అన్నామలై సమీక్షా సమావేశం

# కమల వికాసానికి కృషి

- బీజేపీ శ్రేణులకు అన్నామలై పిలుపు
- ముఖ్య నేతలతో భేటీ

అడయార్, జూన్ 19: సార్వత్రిక ఎన్నికల్లో ఎదురైన ఓటమిని మనసులో పెట్టుకుని ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా, రాష్ట్రంలో కమలం వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు కె.అన్నామలై పిలుపునిచ్చారు. స్థానిక టి.నగర్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం కమలాలయంలో బుధవారం ఉదయం పార్టీ కేంద్ర కమిటీ నిర్వాహకుల సమావేశం అన్నామలై అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఇటీవల ముగిసిన పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి లభించిన ఓట్లు, పోటీ చేసిన ప్రాంతాల్లో పార్టీకున్న గుర్తింపు, పార్టీ నిర్వాహకుల పనితీరు తదితర అంశాలపై విపులంగా చర్చించారు. ఈ సందర్భంగా అన్నామలై పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ, హోం శాఖామంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరుల సూచనల మేరకు పార్టీ నిర్వాహకులందరూ ఏకాభిప్రాయంతో పార్టీని రాష్ట్రంలో మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో 13 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయామని, పోలైన 14 శాతం ఓటు బ్యాంకును కాపాడుకుంటూనే, దీన్ని మరింత పెంచే దిశగా కృషి చేయాలని సూచించారు. జూలై 13వ తేదీన జరిగే విక్రవాండి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ ఇంటింటి ప్రచారానికి వెళ్ళాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామాల్లో పార్టీకి మండల స్థాయిలో నిర్వాహకులు లేరని, దీనిపై కూడా దృష్టిసారించాలన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందే నిర్వాహకులను నియమించడంతో పాటు అన్ని జిల్లాల్లో బూత్ కమిటీలు ఏర్పాటు చేసి, ఆ వివరాలతో కూడిన నివేదికను పార్టీ జిల్లా నేతలు సమర్పించాలని తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా రాష్ట్రంలో అధిక స్థాయిలో తప్పుడు కేసులు నమోదు చేస్తున్న డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కేసులను న్యాయబద్ధంగా ఎదుర్కొంటామన్నారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో న్యాయవాదుల విభాగాన్ని బలోపేతం చేయాలని, ఈ కేసులలో ఇబ్బందుల పాలవుతున్న పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడాని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కో-ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, సీనియర్ నేతలు కేశవ వినాయగం, హెచ్.రాజా, పొన్ రాధాకృష్ణన్, వానతి శ్రీనివాసన్, కరాటే త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

# విక్రవాండిలో లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తాం

- మంత్రి పొన్ముడి ధీమా
- నామినేషన్ దాఖలు చేసిన డీఎంకే అభ్యర్థి

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివా గెలుస్తారని మంత్రి సి.పొన్ముడి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు అన్నియూరు శివా ఎన్నికల నిర్వహణాధికారి చంద్రశేఖర్ వద్ద తన నామినేషన్‌ను సమర్పించారు. మంత్రి పొన్ముడి, ఎంపీలు జగద్రక్షకన్, రవికుమార్, డీఎంకే జిల్లాఇన్‌చార్జి గౌతమ్ శిఖామణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా మంత్రి పొన్ముడి విలేఖరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి పుగళేంది గెలిచారని, ఆ రీతిలోనే ప్రస్తుతం బలమైన అభ్యర్థులెవరూ పోటీలో లేకపోవడం వల్ల లక్ష ఓట్ల మెజారిటీతో డీఎంకే అభ్యర్థి గెలుస్తారని చెప్పారు. గత ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ, పీఎంకే ఒకే కూటమిలో ఉంటూ ఉమ్మడి అభ్యర్థిని పోటీకి దింపిందని, ఆ ఎన్నికల్లో తొమ్మిది వేల మెజారిటీతో డీఎంకే అభ్యర్థి గెలిచారని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ఓటమి భయంతో పోటీకి దూరమైందని, బీజేపీ కూటమిలో ఉన్న పీఎంకే అభ్యర్థిమాత్రమే పోటీ చేయడం వల్ల డీఎంకే అభ్యర్థి సునాయాసంగా గెలిచే అవకాశం ఉందని చెప్పారు.

### పీఎంకే అభ్యర్థి నామినేషన్...

విక్రవాండి నియోజకవర్గం పీఎంకే అభ్యర్థి అన్బుమణి కూడా బుధవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివా నామినేషన్ దాఖలు చేసిన తర్వాత పీఎంకే స్థానిక శాఖ నాయకులతో కలిసి అన్బుమణి ఎన్నికల నిర్వహణాధికారి కార్యాలయం వరకూ ఊరేగింపుగా వెళ్ళారు. ఆ తర్వాత ఎన్నికల అధికారి చంద్రశేఖర్ వద్ద నామినేషన్ దాఖలు చేశారు. ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి డాక్టర్ అభినయా ఈ నెల 20న నామినేషన్ దాఖలు చేయనున్నారని ఆ పార్టీ నేత సీమాన్ తెలిపారు.



మంత్రి పొన్ముడి సమక్షంలో నామినేషన్ దాఖలు చేస్తున్న విక్రవాండి డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివా

# ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు

- సత్యమూర్తి భవన్‌లో కాంగ్రెస్ శ్రేణుల సందడి



రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

ప్యారీస్, జూన్ 19: కాంగ్రెస్ అగ్ర నేత, రాయ్‌బరేలి ఎంపీ రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలను బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చారు. అనేక మంది పేదలకు సంక్షేమ సహాయాలను పంపిణీ చేసి, తమ నేతపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. స్థానిక రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీ) ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తి భవన్‌లో ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను కట్‌చేసి, 'రాహుల్ గాంధీ జయహో.. రాహుల్ వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, ఎమ్మెల్యేల ఈవీకేఎస్ ఇళంగోవన్, సీనియర్ నేతలు కేవీ తంగబాలు, తిరునావుక్కరసర్, జేఎం హారూన్, ఎంపీ విజయ్ వసంత్, ప్రధాన కార్యదర్శులు కె.చిరంజీవి, ఎస్.రంగభాష్యం, ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఎంపీ రంజన్ కుమార్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మైలాపూర్ శాంతోమ్ చర్చి ప్రాంగణంలో బిషప్‌లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే, అన్నాశాలైలో ప్రసిద్ధి చెందిన దర్గాలో పూలచాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి పేదలకు అన్నదానం చేశారు. ప్యారీస్ మన్నడిలో ప్రసిద్ధి చెందిన కాళికాంబాల్ ఆలయంలో స్వర్ణరథంలాగి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. రాహుల్ జన్మదినం సందర్భంగా పలు ప్రాంతాలలో పర్యావరణంపై అవగాహన కల్పించేలా విద్యార్థులు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. దక్షిణ చెన్నై, ఉత్తర చెన్నై, సెంట్రల్ చెన్నై పార్టీ అధ్యక్షులు నేతృత్వంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి, ఈ పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ నేతలు, శ్రేణులు ఘనంగా నిర్వహించారు.

# నేటి నుంచి శాసనసభ సమావేశాలు

- కొత్త పథకాలపై స్టాలిన్ ప్రకటన?

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ సమావేశాలు గురువారం ప్రారంభం కానున్నాయి. పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాలను గెలుచుకుని అటు అన్నాడీఎంకే కూటమిని, ఇటు బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమిని ఓడించిన విజయగర్వంతో పాలకపక్షం ఉండగా, ఎన్నికల ఫలితాలను పక్కనబెట్టి రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలపై సభలో విరుచుకుపడేందుకు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే సిద్ధమవుతోంది. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికల్లో అన్ని చోట్లా గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేసేలా ఈ సభలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కొన్ని ప్రజాకర్షణీయ పథకాలను గురించి ప్రకటించే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు చెల్లిస్తున్న విధంగానే విద్యార్థులకు కూడా ఆగస్టు నుండి ప్రతినెలా రూ.1000లను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసే తమిళ్‌పుదల్వన్ పథకాన్ని ఆగస్టు నుండి అమలు చేయనున్నట్లు స్టాలిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సభలో ఇలాంటి మరికొన్ని పథకాలకు సంబంధించి కూడా ఆయన సభా నిబంధన 110 కింద ప్రకటిస్తారని తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులలో శాసనసభ సమావేశాలు గురువారం ఉదయం ప్రారంభమవుతున్నాయి. ఉదయం 10.10 గంటలకు సమావేశం ప్రారంభం కాగానే స్పీకర్ అప్పావు విక్రవాండి శాసనసభ్యుడు పుగళేంది మృతికి సంతాప తీర్మానం చేస్తారు. ఆ తర్వాత మాజీ శాసనసభ్యుల మృతికి సంతాపం ప్రకటించనున్నారు. ఆ తర్వాత సభ మరుసటి రోజుకు వాయిదపడుతుంది. శుక్రవారం ఉదయం మళ్ళీ సభ ప్రారంభం కాగానే సమావేశాలు ఉదయం, మధ్యాహ్నం అంటూ రెండు పూటలా జరుపుకునేందుకు వీలు కలిగిస్తూ ప్రత్యేక తీర్మానం చేస్తారు. ఆ తీర్మానం ప్రకారం శనివారం నుండి రెండు పూటలా శాసనసభ సమావేశాలు జరుగనున్నాయి. ఉదయం 9.30 గంటలకు సభ ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటదాకా జరుగుతుంది. ఆ తర్వాత సాయంత్రం ఐదు నుండి రాత్రి ఎనిమిది గంటలవరకు జరుగుతుంది. శాఖలవారీగా ఆర్థిక అనుబంధ పద్దులపై ఆయా శాఖలకు సంబంధించిన మంత్రులు సభ్యులడిగే ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ ప్రసంగించనున్నారు. కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ పథకం లబ్ధిదారుల సంఖ్య పెంపునకు సంబంధించి ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటన చేస్తారు. అదేవిధంగా మరికొన్ని కొత్త పథకాలను కూడా ప్రకటిస్తారు. ఇక ఆ సమావేశాల్లో ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే, బీజేపీ సభ్యులు రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ పాలకపక్షంపై ధ్వజమెత్తనున్నాయి. అదే విధంగా జూలై ఒకటి నుంచి పెరగనున్న విద్యుత్ ఛార్జీలకు సంబంధించి కూడా ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేయనున్నాయి. మరీ ముఖ్యంగా కళ్లకుర్చి జిల్లాలో కల్తీసారా తాగి కార్మికులు మృతి చెందిన ఘటన ఈ సారి శాసనసభలో ప్రకంపనలు రేపడం ఖాయమని తెలిసింది.

## సమాచార దర్శిని

### గ్రూప్-4 పరీక్ష ఆన్సర్ కీ విడుదల

పెరంబూర్, జూన్ 19: టీఎన్‌పీఎస్సీ గ్రూప్-4 పరీక్షల ఆన్సర్ కీ మంగళవారం విడుదలైంది. తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 6,244 పోస్టుల భర్తీకి ఈ నెల 9వ తేదీ నిర్వహించిన పరీక్షకు సుమారు 16 లక్షల మంది హాజరయ్యారు. ఈ నేపథ్యంలో, ఆ పరీక్ష ఆన్సర్ కీ https://tnpsc.gov.in/ engilsh/answerkeys.aspx అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. వీటిలో ఏవైనా ఆక్షేపణలుంటే ఈ నెల 25వ తేది లోపు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో తెలియజేయాలని టీఎన్‌పీఎస్సీ ప్రకటనలో తెలిపింది.

### ముఖ్యనేతల జయంతికి స్వీట్ పొంగల్

పెరంబూర్, జూన్ 19: ముఖ్యనేతల జయంతి ఉత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు స్వీట్ పొంగల్ అందించాలని రాష్ట్రప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, పౌష్టికాహార పథకం కింద పనిచేస్తున్న 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్వీట్ పొంగల్ అందించనున్నారు. ఇందుకోసం రూ.4.27కోట్లనిధులను ప్రభుత్వం కేటాయించింది.

### 22న ఐదు జిల్లాల్లో భారీ వర్షం!

ఐసిఎఫ్, జూన్ 19: నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూర్, తేని, దిండుగల్ జిల్లాల్లో ఈ నెల 22వ తేదీన భారీ వర్షం కురిసే అవకాశముందని చెన్నై వాతావరణ కేంద్రం ప్రకటించింది. మన్నార్‌వళైకుడా, దాని చుట్టుపక్కల రాష్ట్ర సముద్ర తీర ప్రాంతాల్లో గంటకు 35 నుంచి 85 కి.మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఆయా ప్రాంతాల్లో జాలరులు చేపల వేటకు వెళ్లరాదని సూచించింది.

### మూడేళ్లలో 7 కోట్ల నాప్‌కిన్ల వినియోగం

పెరంబూర్, జూన్ 19: రాష్ట్రంలో మూడేళ్లలో పాఠశాల విద్యార్థినులకు రూ.7.74 కోట్ల ప్యాకెట్లలో శానిటరీ నాప్‌కిన్లు అందజేసినట్లు, అందుకోసం ప్రతి ఏడాది రూ.115 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ఆరోగ్యశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా శానిటరీ నాప్‌కిన్లు అందించే పథకం గత 2011లో రాష్ట్రప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం కింద విద్యార్థినులు, మహిళలకు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా శానిటరీ నాప్‌కిన్లు అందజేస్తున్నారు. 10నుంచి 19ఏళ్లలోపున్న విద్యార్థినులు 43 లక్షల మంది ప్రతి ఏడాది ఈ పథకంలో లబ్ధిపొందుతున్నారని ఆరోగ్యశాఖ తెలియజేసింది.

### 600 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, జూన్ 19: మేట్టూరు థర్మల్ విద్యుత్ కేంద్రంలో 600 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. ఈ కేంద్రంలో రెండు విభాగాలు పనిచేస్తున్నాయి. వీటిలో 1,440 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. మొదటి విభాగంలో తలా 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5 యూనిట్ల ద్వారా 840 మెగావాట్లు, రెండవ విభాగంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఒక యూనిట్ ద్వారా లభించే విద్యుత్ రాష్ట్ర అవసరాలు భర్తీ చేస్తోంది. మంగళవారం ఉదయం 6 గంటలకు రెండవ విభాగంలో బాయిలర్ ట్యూబ్ పంక్చర్ కావడంతో 600 మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మరమ్మతుల అనంతరం యథావిధిగా ఉత్పత్తి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

### పేదలకు ఆర్థికసాయం

ఐసిఎఫ్, జూన్ 19: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు రూ.2 లక్షలు ఆర్థికసాయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. కలైంజర్ కరుణానిధి ట్రస్ట్ కోసం కరుణానిధి బ్యాంకులో డిపాజిట్ చేసిన రూ.1 కోటి నుంచి ప్రతి నెలా లభించే రూ.2 లక్షల వడ్డీని పేదలకు వైద్యం, విద్య కోసం అందజేస్తుంటారు. ఆ ప్రకారం, జూన్ నెల వడ్డీ రూ.2 లక్షల్లో 8 మందికి తలా రూ.25 వేల చొప్పున ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు.

### వృద్ధులకు తపాలా ఓటు

ఐసిఎఫ్, జూన్ 19: విక్రవాండి నియోజకవర్గ ఉప ఎన్నికల్లో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు తపాల ఓటు వినియోగించుకోవచ్చని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నియోజకవర్గ ఉప ఎన్నిక జూలై 10వ తేది జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఇష్టపడే వృద్ధుల, దివ్యాంగుల అభిప్రాయాలు పరిశీలించి, వారు తపాలాట ఓటు వేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది.

### నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూన్ 19: స్థానిక తరమణి ఐటీ కారిడార్ పరిధిని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సమావేశం గురువారం జరుగనుంది. సీఎస్ఐఆర్ రోడ్డులో వున్న టైడల్ పార్కు ఉపవిద్యుత్ కేంద్ర ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రీవెన్స్‌లో వినియోగదారులు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని అధికారులు సూచించారు.

### జూలై 27, 28 తేదీల్లో స్కేటింగ్ పోటీలు

ఐసిఎఫ్, జూన్ 19: గ్రేటర్ చెన్నై స్పీడ్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోరూర్ సమీపంలోని గెరుగంబాక్కంలో జూలై 27, 28 తేదీల్లో జిల్లా స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలు జరుగనున్నాయి. ఔత్సాహికులు www.tnsa.in అనే వెబ్‌సైట్‌లో గురువారం నుంచి పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 7904615668, 9600635806 మొబైల్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

### ప్రవేశ పరీక్షపై శిక్షణ

ఐసిఎఫ్, జూన్ 19: చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ సంస్థ (సీపీసీఎల్) విద్యార్థులకు జేఈఈ ప్రవేశపరీక్షపై శిక్షణ ఇవ్వనుంది. ఆర్థికంగా వెనుకబడిన ప్లస్‌టూ ఉత్తీర్ణులైన 30 మంది విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వనుంది. స్థానిక మనలిలో వున్న సీపీసీఎల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 23వ తేదీన విద్యార్థుల ఎంపిక జరుగనుంది. మరిన్ని వివరాల కోసం 6380988951 మొబైల్ నెంబరులో గానీ, www.csrl.in అనే వెబ్‌సైట్‌లో గానీ సంప్రదించవచ్చు.

### ‘కలై సెమ్మల్’ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 19:‘కలై సెమ్మల్’ పురస్కారానికి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కళలు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రానికి చెందిన సంప్రదాయ కళాకారులు, ఆధునిక కళా నిపుణులు,లలిత కళల రంగంలో గొప్ప విజయాలు, సేవలను అభినందించేలా ప్రతి సంవత్సరం ఆరుగురు కళాకారులకు ‘కలైసెమ్మల్’పురస్కారం అందజేస్తున్నారు. ఆ ప్రకారం 2024-25 ఏడాదికి గాను పురస్కారానికి అర్హులైన కళాకారులు ‘డైరెక్టర్, కళలు, సాంస్కృతికశాఖ, తమిళ అభివృద్ధి కాంప్లెక్స్ రెండవ అంతస్తు, తమిళ్‌రోడ్డు, ఎగ్మూర్, చెన్నై - 8’ అనే చిరునామాకు దరఖాస్తులు పంపవచ్చు.

# మాంజోలై ఎస్టేట్ కార్మికులకు ఊరట

**గెంటివేతపై హైకోర్టు ‘స్టే’**

చెన్నై, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా అంబాసముద్రం తాలూకాలోని మాంజోలై తేయాకు ఎస్టేట్ కార్మికులను ఖాళీ చేయాలంటూ ‘ది బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్’ ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఈ స్టే కొనసాగుతుందని స్పష్టం చేసింది. మాంజోలై తేయాకు ఎస్టేట్ ప్రాంతంలో తరాల తరబడి పనిచేసిన కార్మికుల కుటుంబాలకు ఇల్లూ వాకిలీ అంటూ ఏవీ లేవని, ఆ ఎస్టేట్‌ను నడుపుతున్న చాలీచాలని వేతనంతో పచ్చటి వాతావరణంలో ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తుండగా రెండేళ్లలో లీజు ముగియనుందన్న సాకుతో కార్మికులను ఉన్న పళాన ఖాళీ చేయమని ఆదేశించడం అన్యాయమని, కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి, నివాసయోగం తదితర వసతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ ఆ ప్రాంతానికి చెందిన అముదా స్టాలిన్ హైకోర్టు మదురై డివిజన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం మాంజోలై ఎస్టేట్ వద్ద ఐదువందల మంది దాకా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారని, వారికి ఆ చిరునామా కలిగిన ఆధార్, రేషన్ కార్డులు ఉన్నాయని, అలాంటిప్పుడు వారిని కొండమీది నుండి ఖాళీ చేస్తే ఆ కార్డులతో ఎక్కడా రేషన్ సరకులు పొందలేరని పేర్కొన్నారు. మాంజోలై ఎస్టేట్ కార్మికులందరికీ కలైంజర్ ఇళ్ళ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వాలని కూడా కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం మాంజోలై కార్మికులకు ప్రత్యామ్నాయ నివాసం తదితర సదుపాయాలను కల్పించేంత వరకూ వారిని ఎస్టేట్ ప్రాంతం నుండి పంపకూడదని తేల్చిచెప్పింది. మాంజోలై కార్మికుల విషయమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ అఫిడవిట్‌లు దాఖలు చేయాలని కూడా ఆదేశించింది.



తేయాకు సేకరణలో కార్మికులు(ఫైల్‌ఫొటో)

## నేడు రామనాథపురానికి రాజ్‌నాథ్ సింగ్ రాక

చెన్నై, జూన్19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం రామనాథపురానికి విచ్చేయనున్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినాన్ని దేశవ్యాప్తంగా పాటించనున్నారు. ఆ మేరకు రామనాథ పురం జిల్లా ధనుష్కోటి అరిచ్చలై మునైలో ఈనెల 21 ఉదయం ఆరుగంటలకు జరిగే యోగా కార్యక్రమంలో రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొననున్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ఆయన గురువారం సాయంత్రం రామనాథపురానికి హెలికాప్టర్‌లో రానున్నారు. మండపం ప్రాంతంలోని సముద్రతీర భద్రతాదళం శిబిరానికి వెళ్ళి పరిశీలన జరుపనున్నారు. ఆ తర్వాత ఉచ్చిపుల్లి ఐఎన్ఎస్ ఈగిల్ నేవీ దళానికి వెళ్ళి తనిఖీ జరుపుతారు. ఆ తర్వాత శుక్రవారం ఉదయం ఆరుగంటలకు సైనిక, వైమానిక, నావికా దళాలల అధికారులు, ఉద్యోగులు మెరైన్ పోలీసులు పాల్గొనే యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. కార్యక్రమంలో రామనాథపురం కలెక్టర్, ఎస్పీ కూడా పాల్గొంటారు.



రాజ్‌నాథ్ సింగ్

## మే, జూన్ నెలల కందిపప్పు, పామాయిల్ అందజేస్తాం

● మంత్రి చక్రపాణి

పెరంబూర్, జూన్ 19: మే, జూన్ నెలలకు సంబంధించిన కందిపప్పు, పామాయిల్ రేషన్‌కార్డుదారులందరికీ అందిస్తామని ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... మే నెలల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కందిపప్పు, పామాయిల్ టెండర్లలో జాప్యం చోటుచేసుకుందన్నారు. అనంతరం కోడ్ రద్దయ్యాక మే నెలలో కందిపప్పు, పామాయిల్ పొందని వారికి జూన్ నెలలో తీసుకోవాలని ఇప్పటికే తెలియజేశామన్నారు. మే నెలకు 1,89,89,000 కిలోల కందిపప్పు కేటాయించగా, 1,37,79,000 కిలోలు అందజేసినట్లు మంత్రి తెలిపారు.

## కోయంబేడు మార్కెట్లో 8 దుకాణాలకు సీలు

ఐసిఎఫ్, జూన్ 19: స్థానిక కోయంబేడు మార్కెట్టులో 8 దుకాణాలకు అధికారులు సీలు వేశారు. ఆహార భద్రత శాఖ, మార్కెట్ నిర్వహణ కమిటీ అధికారులు ఇటీవల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ‘ఎథిలిన్’ అనే రసాయనంతో అరటికాయలు కృత్రిమంగా మగ్గించి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కృత్రిమ పద్ధతిలో అరటి కాయలు మగ్గించిన 8 దుకాణాలకు తాజాగా సీలు వేశారు.

## దొడ్డబెట్ట వెళ్లేందుకు పర్యాటకులకు నిషేధం

ఐసిఎఫ్, జూన్ 19: పర్యాటకులకు దొడ్డబెట్టకు వెళ్లేందుకు మూడు రోజుల పాటు అటవీశాఖ నిషేధం విధించింది. దొడ్డబెట్టలో ప్రవేశ టిక్కెట్లు అందజసే భవనం నిర్మాణ పనులు, భూగర్భ కేబుల్ ఏర్పాటు పనులు చేపట్టనుండడంతో బుధవారం నుంచి శుక్రవారం వరకు తాత్కాలికంగా పర్యాటకులు దొడ్డబెట్ట శిఖరానికి వెళ్లేందుకు అటవీశాఖ అధికారులు అనుమతులు నిలిపేశారు.

## మధ్యాహ్న భోజనంతో పొంగల్ పంపిణీకి నిధులు

ఐసిఎఫ్, జూన్ 19: మధ్యాహ్న భోజనంతో పొంగల్ అందజేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పౌష్టికాహార పథకంలో 10వ తరగతి వరకు విద్యార్థులకు, మాజీ ముఖ్యమంత్రులైన దివంగత కామరాజర్, అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి జయంతి రోజున ‘తీపి పొంగల్’ అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే మధ్యాహ్నం భోజనానికి వినియోగించే బియ్యం, ఆ రోజు ఖర్చులకయ్యే నగదు పొంగల్‌కు వినియోగించడం వల్ల మధ్యాహ్న భోజనం అందజేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖుల పుట్టిన రోజుల్లో మధ్యాహ్నం భోజనంతో పాటు తీపి పొంగల్ చేర్చి, అందజేయాలని సూఇచంచిన ప్రభుత్వం.. సంవత్సరంలో ఐదు రోజులకు రూ.4.27 కోట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## 60 కళాశాలలకు ప్రిన్సిపాళ్లు లేరు

ఐసిఎఫ్, జూన్ 19: రాష్ట్రంలో 60 కళాశాలలకు ప్రిన్సిపాళ్లు లేరని ఉన్నత విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో మొత్తం 164 ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలుండగా, అందులో 60 కళాశాలలు కేవలం తాత్కాలిక ప్రిన్సిపాళ్ల మీదే ఆధారపడి నడుస్తుండడం గమనార్హం. తద్వారా కళాశాలల నిర్వాహణ దెబ్బతినడమే గాక, విద్యా నాణ్యత కూడా తగ్గుతోందని విద్యానిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా ఆయా కళాశాలలకు శాశ్వత ప్రిన్సిపాళ్లను నియమించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మెట్టూరు థర్మల్ కేంద్రంలో సాంకేతిక లోపం

అడయార్, జూన్ 19: సేలం జిల్లా మెట్టూరు థర్మల్ విద్యుత్ కేంద్రంలో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో 600 మెగావాట్‌ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. మెట్టూరు థర్మల్ కేంద్రంలో రెండు విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు పనిచేస్తున్నాయి. మొదటి యూనిట్‌లో 840 మెగావాట్‌లు, రెండో యూనిట్‌లో 600 మెగావాట్‌ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. అయితే, రెండో యూనిట్‌లో సోమవారం రాత్రి సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో 600 మెగావాట్‌ల విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. ఈ సమస్యను సరిచేసే పనుల్లో ఇంజనీర్లు నిమగ్నమయ్యారు.

## సెంథిల్ బాలాజీకి రిమాండ్ పొడిగింపు

ప్యారీస్, జూన్ 19: మాజీ మంత్రి, డీఎంకే నేత సెంథిల్ బాలాజీకి న్యాయస్థానం 40వ సారిగా ఈ నెల 28వ తేదీ వరకు రిమాండ్ పొడిగించింది. మనీ లాండరింగ్ కేసులో గత 2023 జూన్ 14వ తేదీన అప్పటి మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేసిన విషయం తెల్సిందే. న్యాయస్థానం ఆయనకు విధించిన రిమాండ్ గడువు బుధవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయనను కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన చెన్నై ప్రిన్సిపల్ కోర్టు జ్యూడిషియల్ కస్టడీని ఈ నెల 28వ తేదీ వరకు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా వుంటే, విడుదల చేయాలని కోరుతూ సెంథిల్ బాలాజీ తరపున దాఖలైన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశించింది.

## నీట్ అక్రమాలను ఖండిస్తూ రేపు కాంగ్రెస్ ధర్నా

ప్యారీస్, జూన్ 19: దేశంలోని వైద్య కాలేజీల్లోని కోర్సుల ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ప్రవేశపరీక్షల్లో చోటు చేసుకున్న అవకతవకలు, అక్రమాలను ఖండిస్తూ ఈ నెల 21వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా చేయనున్నట్టు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ప్రకటించింది. రాష్ట్రంలో నీట్ పరీక్షల రద్దు చేయాలని కోరుతూ పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీటిపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు వరుసగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నాయి. దీంతో నీట్ నుంచి రాష్ట్రానికి మినహాయింపు నివ్వాలని కోరుతూ కేంద్రం వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీనికి తోడు తాజాగా నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఈ చర్యలన్ని ఖండిస్తూ ఈ నెల 21వ తేదీన ధర్నా చేయాలని ఆ పార్టీ పిలుపునిచ్చింది.

## మెట్రో రైల్వేస్టేషన్లలో ‘లులు మార్కెట్లు’

ఐసిఎఫ్, జూన్ 19: చెన్నై సెంట్రల్, షెనాయ్‌నగర్, వింకోనగర్ మెట్రో రైల్వే స్టేషన్లలో ‘లులు’ సంస్థ హైపర్ మార్కెట్లను త్వరలోనే ప్రారంభించనుంది. రాష్ట్రంలో తొలిసారిగా ఈ సంస్థ కోయంబత్తూరులో విక్రయ ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు నగరంలో హైపర్ మార్కెట్లు ఏర్పాటు చేసేందుకు ఈ సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది.

## విక్రవాండి ఎన్నికలో ఏ పార్టీకి మద్దతు లేదు

● టీవీకే నేత విజయ్

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగనున్న ఉప ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇచ్చే ప్రసక్తేలేదని తమిళగ వెట్రి కళగం నేత, నటుడు విజయ్ ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన జారీ చేస్తూ జూలై 10న జరుగనున్న విక్రవాండి ఎన్నికల్లో తమ పార్టీ సభ్యులు, అభిమానులు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటువేసుకోవచ్చునని తెలిపారు. ప్రస్తుతం విక్రవాండి ఉప ఎన్నికల్లో పార్టీ పోటీ చేసే స్థితిలోనూ లేదని ఆయన స్పష్టం చేశారు.

## చిన్నారులకు వైరస్ జ్వరాలపై ఆందోళన వద్దు

● మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం చిన్నారులకు వ్యాపిస్తున్న వైరస్ జ్వరాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఓ వైపు ఎండలు, మరోవైపు వర్షాలు అంటూ వాతావరణంలో మార్పుల వల్ల చిన్నారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు వైరస్ జ్వరాలు వస్తున్నాయని చెప్పారు. రక్తపరీక్షలు జరుపుకుని వైద్యుల సలహా ప్రకారం మందులు వాడితే ఈ జ్వరాలు త్వరగా నయమవుతాయన్నారు. గత యేడాది కంటే ఈ యేడాది వైరస్ జ్వరాలు విపరీతంగా వ్యాపిస్తాయని పుకార్లు వ్యాపింపజేస్తున్నారని, వీటిని ఎవరూ పట్టించుకోకూడదని ఆయన పేర్కొన్నారు.

## జానపద కళాకారులకు బస్సుల్లో 50 శాతం చార్జీ రాయితీ

ఐసిఎఫ్, జూన్ 19: వృత్తిరీత్యా ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించే జానపద కళాకారులకు 50 శాతం చార్జీల రాయితీని రవాణాశాఖ కల్పించింది. ఈ మేరకు ఆ శాఖ మంత్రి శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. వాయిద్య పరికరాలతో బస్సుల్లో ఎక్కే జానపద కళాకారులను కండక్టర్ దింపేసిన ఘటన దిండుగల్‌లో చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తమను అవమానించారంటూ కళాకారులు చేసిన ఆరోపణలపై స్పందించిన రవాణాశాఖ మంత్రి.. కళాకారులు తమ వాయిద్యాలతో బస్సులు ఎక్కడమే కాకుండా, చార్జీల్లో 50 శాతం రాయితీ కూడా పొందేలా ఉత్తర్వులు జారీ చేశారు. జానపద కళాకారులను బస్సుల్లోకి అనుమతించని డ్రైవర్, కండెక్టర్లపై శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.

## రాహుల్‌కు సెల్లూర్ రాజు శుభాకాంక్షలు

● మండిపడిన అన్నాడీఎంకే నేతలు

ప్యారీస్, జూన్ 19: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి సెల్లూర్ రాజు శుభాకాంక్షలు తెలిపి వివాదంలో చిక్కుకున్నారు. ఆయన తరచుగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్న విషయం తెల్సిందే. గతంలో దేశంలోని నాయకుల్లో రాహుల్ గాంధీ అంటే తనకు ఎంతో ఇష్టమని ప్రశంసలు గుప్పిస్తూ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేయగా, అన్నాడీఎంకే నేతలను తీవ్ర ఆగ్రహం తెప్పించింది. దీంతో సీనియర్ నేతల విజ్ఞప్తి మేరకు ఆ పోస్ట్‌ను ఎక్స్ పేజీ నుంచి తొలగించిన సెల్లూరు రాజు మళ్ళీ బుధవారం మరో కొత్త చర్చకు తెరలేపారు. రాహుల్ గాంధీ సంకల్పం, పట్టుదల దేనినైనా సాధించాలన్న తపన, వల్లే కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో మనుగడ సాగించగలుగుతుందని, రాహుల్ జన్మదినం సందర్భంగా ఆయన నిండు నూరేళ్ళు జీవించాలంటూ ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని ప్రకటించడం ఇపుడు అన్నాడీఎంకే నేతలను మళ్ళీ ఆగ్రహానికి తెప్పించింది.

## కిరోసిన్ పొందే రేషన్‌కార్డుదారుల గృహాల్లో తనిఖీలు

ఐసిఎఫ్, జూన్ 19: రాష్ట్రంలో కిరోసిన్ పొందే రేషన్‌కార్డుదారుల గృహాల్లో నిజంగానే గ్యాస్ కనెక్షన్ వుందా లేదా అని తెలుసుకునేందుకు తనిఖీ చేయాలని అధికారులను ఆహారశాఖ ఆదేశించింది. రాష్ట్రంలో కిరోసిన్ పొందే 30 లక్షల మంది రేషన్‌కార్డుదారులున్నారు. వీరికి లీటరు కిరోసిన్ రూ.15కు విక్రయిస్తున్నారు. అయితే వీరిలో పలువురికి గ్యాస్ కనెక్షన్లు వున్నాయని, అయినప్పటికీ రేషన్ ద్వారా కిరోసిన్ పొందుతున్నారని పౌరసరఫరాల శాఖాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో కిరోసిన్ పొందే రేషన్‌కార్డుదారులందరికి ఇళ్లలో తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## రుణాలు పొందేందుకు దరఖాస్తుల అహ్వానం

ఐసిఎఫ్, జూన్ 19: మైనారిటీల ఆర్థికాభివృద్ధి సంస్థ ద్వారా పని చేసే వ్యక్తిగత రుణం, స్వయం సహాయక సమూహాల కోసం చిన్నవ్యాపార రుణం, చేతివృత్తుల వారికి రుణం, విద్యా రుణం పథకాలకు దరఖాస్తు కోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ లక్ష్మీ సిద్ధార్థ్ తెలిపారు. చెన్నై జిల్లాలో నివశించే క్రైస్తవ, ఇస్లాం, సిక్కు, బౌద్ధ, పార్శీ, జైన మతాలకు చెందిన రుణాలు పొందేందుకు కలెక్టర్ కార్యాలయం లోని జిలిల్లా మైనారిటీల సంక్షేమ విభాగంలో దరఖాస్తు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

## 10 లోపు గృహ నిర్మాణ పనులు ప్రారంభించాలి

ఐసిఎఫ్, జూన్ 19: ‘కలైంజర్ కనవు ఇల్లం’ పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసి జూలై 10వ తేదీలోగా గృహ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని గ్రామాల్లో 8 లక్షల కాంక్రీట్ గృహాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. తొలివిడతగా 2024-25వ సంవత్సరంలో లక్ష గృహాలు తలా రూ.3.50 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. లబ్ధిదారుల ఎంపిక ఈ నెల 25వ తేదీతో ముగియనుంది. జూలై 10వ తేదీ లోగా వారు గృహ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

## శ్రీలంక చెర నుంచి జాలర్లను విడిపించండి

కేంద్ర మంత్రికి స్టాలిన్ లేఖ

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక చెరలో మగ్గుతున్న తమిళ జాలర్లను, ఆ దేశ నావికాదళం స్వాధీనం చేసుకున్న పడవలను విడిపించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ లేఖ రాశారు. మంగళవారం చేపలవేట సాగించిన పుదుకోట ప్రాంతానికి చెందిన నలుగురు జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిందని, వారి పడవలను కూడా తరలించుకెళ్ళిందని ఆ లేఖలో వివరించారు. ప్రస్తుతం శ్రీలంక చెరలో 15 మంది తమిళ జాలర్లు ఉన్నారని, 162 మర పడవలు అక్కడి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు జరుపటం ఆనవాయితీగా మారిందని తెలిపారు.ఇక ఏమాత్రం జాప్యం వహించకుండా 15మంది జాలర్లను,వారి పడవలను విడిపించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.

## నేడు విద్యుత్తుండని ప్రాంతాలు

అడయార్, జూన్ 19: వివిధ రకాలైన సాంకేతిక, ఇంజనీరింగ్ మరమ్మతు పనుల కారణంగా గురువారం స్థానిక పమ్మల్, పల్లావరం, అనకాపుత్తూరు, పొళిచ్చలూరు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపివేయనున్నట్టు తమిళనాడు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. పల్లావరం పరిధిలోని ఆఫీసర్స్ రోడ్డు, వెంకటేశ్వర నగర్, మూవర్ నగర్, అగస్తీశ్వర కోయిల్ 1, 2 వీధులు, ఆండాళ్ నగర్, గౌల్ బజార్, ఇందిరా నగర్, శివశంకర్, ప్రేమ్ నగర్, పెరుంబాక్కం, రెట్టపిళ్ళైయార్ వీధి, ఏకుమలై వీధి, పంబల్ ప్రాంతంలోని నల్లతంబి వీధి, దేవదాస్ వీధి, కక్కన్ వీధి, త్యాగరాయ వీధి, ప్రభాకరన్ వీధి, అన్నానగర్‌లోని 3, 4 ప్రధాన రోడ్లు, ఏడో క్రాస్ వీధి, గాంధీ వీధి, రాధాకృష్ణన్ రోడ్డు, లక్ష్మి నారాయణన్ నగర్‌లోని రెండో వీధి, నాంజిలార్ వీధి, శంకర్ నగర్‌లోని అన్ని వీధులలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

మాస్ మాజీ అధ్యక్షుడు

## జగ్గయ్య కన్నుమూత

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ‘మద్రాస్ ఆది ఆంధ్ర అరుంధతీయ ఆదివాసి సంక్షేమ సంఘం’ (మాస్) మాజీ అధ్యక్షుడు ఒ.జగ్గయ్య (80) బుధవారం ఉదయం కన్ను మూశారు. స్థానిక ఆంజనేయనగర్, 2వ లేన్‌లోని ఆయన స్వగృహంలో ఆయన తుది శ్వాస విడిచారు. సాయంత్రం స్థానిక మూలకొత్తలం శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. జగ్గయ్య ఇన్‌కంట్యాక్స్‌లో సుదీర్ఘకాలం ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం పదవీవిరమణ చేశారు. ఆ తరువాత పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మాస్ అధ్యక్షునిగా, సలహాదారుగా క్రియాశీలకంగా వ్యవహరించారు. జగ్గయ్య మృతి పట్ల మాస్ అధ్యక్షులు డాక్టర్ కొల్లి రాజు, ఇతర నిర్వాహకులు, నగరంలోని వివిధ తెలుగు సంఘాలు తీవ్ర సంతాపం ప్రకటించారు.



జగ్గయ్య (ఫైల్‌ఫొటో)

## మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న 51 మంది అరెస్ట్

పెరంబూర్, జూన్ 19: నగరంలోని వివిధ ప్రాంతాల్లో గుట్కా సహా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న 51 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నగర పోలీసు శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో, మాదకద్రవ్యాల చెలామణి, విక్రయాలు, తరలింపులను అడ్డుకొనేలా నగర్ పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ‘డ్రైవ్ అగనెస్ట్ డ్రగ్స్’ పేరుతో గస్తీ పనులు చేపట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు. ఈ బృందాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ నెల 11 నుంచి 17వ తేది వరకు తనిఖీలు చేపట్టి మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ఘటనలకు సంబంధించి 32 కేసులు నమోదుచేసి 51 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 60.2 కిలోల గంజాయి, 55 గ్రాముల మెథాంపెటామైన్, 4,439 నొప్పి నివారణ మాత్రలు, 3 సెల్‌ఫోన్లు, రూ.3,900 నగదు, 8 ద్విచక్రవాహనాలు, 1 కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేది నుంచి ఈ నెల 17వ తేది వరకు మాదకద్రవ్యాలు విక్రయించిన 156 మందిని గూండా చట్టం కింద అరెస్ట్ చేసినట్లు నగర పోలీసు శాఖ తెలియజేసింది.

## విద్యార్థులకు నకిలీ సర్టిఫికెట్లు

ఇద్దరి అరెస్టు

అడయార్, జూన్ 19: కడలూరు జిల్లా చిదంబరం ప్రాంతంలో పాఠశాల, కాలేజీ విద్యార్థులకు నకిలీ సర్టిఫికేట్లు పంపిణీ చేసిన ఆలయ పూజారి సహా ఇద్దరిని ఆర్థిక నేర విభాగం పోలీసులు అరెస్టు చేశారు. చిదంబరం మీదిగుడి ప్రాంతానికి చెందిన నాగప్పన్ శెట్టియార్ అనే వ్యక్తి, నార్త్ మెయిన్‌రోడ్‌కు చెందిన శంకర్ అనే పూజారిలు కలిసి పాఠశాల, కాలేజీల్లో కొత్త విద్యా సంవత్సరంలో చేరే విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను నకిలీవి తయారు చేసి విక్రయించడంతో పాటు కొన్ని ఒరిజినల్ సర్టిఫికేట్‌లలో సవరణలకు పాల్పడుతున్నట్టు చిదంబరం ఆర్థిక నేర విభాగం అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆ ఇద్దరిని అరెస్టు చేసి వందకు పైగా నకిలీ సర్టిఫికేట్లు, ల్యాప్‌టాప్, కంప్యూటర్, కలర్ ప్రింటర్, రబ్బర్ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు.

## మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ బెయిల్ పిటిషన్ వాయిదా

అడయార్, జూన్ 19: గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో రవాణా శాఖామంత్రిగా ఉన్న రూ.100 కోట్ల విలువ చేసే భూమిని కబ్జా చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ ముందస్తు బెయిల్ కోరుతూ మూడోసారి దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదా పడింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో అవినీతి నిరోధక శాఖ పోలీసులు మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్‌కు సంబంధించి చెన్నై, కరూర్ వంటి 20 ప్రాంతాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన తనిఖీల్లో కీలకమైన దస్తావేజులు లభ్యమయ్యాయి. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన కరూర్ జిల్లా మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, దీన్ని బుధవారం విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి షణ్ముగ సుందరం తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## ఆటో రేస్ : ఏడుగురు డ్రైవర్ల అరెస్టు

అడయార్, జూన్ 19: మీంజూరు - వండలూరు ఔటర్ రింగ్ రోడ్డులో ఆటో రేస్ నిర్వహించి ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన ఏడుగురు ఆటో డ్రైవర్లను నగర పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు ఆటోలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 15వ తేదీన తిరువళ్ళూరు జిల్లా మీంజూరు - వండలూరు ఔటర్ రింగ్ రోడ్డులో కొందరు డ్రైవర్లు ఆటో రేస్ నిర్వహించారు. ఈ రేసింగ్ పోటీల కారణంగా మూడు ద్విచక్రవాహనాలు ఒకదానితర్వాత ఒకటి ఢీకొన్ని కుండ్రత్తూరుకు చెందిన మణి, అంబత్తూరుకు చెందిన శ్యాంసుందర్ అనే ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అయితే, రెడ్‌హిల్స్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఆటో రేస్ నిర్వహించిన ముగప్పేర్‌కు చెందిన చంద్రు (38), ప్రేమ్ కుమార్ (33), మది (43), రమేష్ (38), జైసన్ (31), రాజశేఖర్ (35), గౌతం (24) అనే ఆరుగురు ఆటో డ్రైవర్లను అరెస్టు చేశారు. రేసింగ్‌కు ఉపయోగించిన ఆటోలలో రెండింటిని స్వాధీనం చేసుకోగా, మిగిలిన వాటి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆటో డ్రైవర్లపై హత్య, రాష్ డ్రైవింగ్‌తో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ప్రేమికుడి మృతి

● ప్రేమికురాలి ఆత్మహత్య

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యూవాషర్‌మెన్‌పేటలో మూడు రోజులకు ముందు ప్రేమికుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో దిగులు చెందిన ప్రేమికురాలు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భారతినగర్‌లో నివసిస్తున్న పద్మప్రియ (17) తిరువొత్తియూరుకు చెందిన యువకుడు రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. మూడు రోజులకు ముందు ఆ యువకుడు మోటారు బైకు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయ తెలియడంతో దిగ్భ్రాంతి చెందిన పద్మప్రియ దిగులు చెందింది. మంగళవారం రాత్రి తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనపై న్యూవాషర్‌మెన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

## రైళ్ళలో టిక్కెట్ లేని ప్రయాణం

● రూ.1.64 లక్షల అపరాధం వసూలు

ప్యారీస్, జూన్ 19: అన్ రిజర్వుడ్ బోగీల్లో టిక్కెట్ లేకుండా ప్రయాణం చేసిన వారి నుంచి రూ.1.64 లక్షలకు పైగా అపరాధం వసూలు చేసినట్టు దక్షిణ రైల్వే ఉన్నతాధికారులు వెల్లడించారు. కేంద్ర రైల్వే శాఖామంత్రి బుధవారం రాష్ట్రంలోని రైల్వే జోన్ల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. రిజర్వుడ్ బోగీలలో టిక్కెట్ లేకుండా ప్రయాణం చేసే వారి గురించి రైల్ మదాత్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై మంత్రి చర్చించారు. ప్రతి రోజూ విధిగా టీసీలు తనిఖీల్లో పాల్గొనాలని మంత్రి సూచించారు. మదురై రైల్వే డివిజన్‌లో వైగై, గురువాయూర్, పాల్ఘాట్, పళని తూత్తుకుడి, మైసూర్ రైళ్ళలో గత ఐదు రోజులలో చేపట్టిన తనిఖీల్లో టిక్కెట్ లేకుండా ప్రయాణం చేసిన వారి నుంచి జరిమానాగా రూ.1,64,415 అపరాధాన్ని వసూలు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

## నకిలీ టీసీ అరెస్టు

ప్యారీస్, జూన్ 19: తాంబరం - నాగర్‌కోయిల్ మధ్య నడిచే అంత్యోదయ రైలులో ప్రయాణికుల వద్ద టిక్కెట్ తనిఖీ చేసిన నకిలీ టీసీని రైల్వే ఉన్నతాధికారులు గుర్తించి అరెస్టు చేశారు. తాంబరం రైల్వేస్టేషన్ నుంచి అంత్యోదయ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ రాత్రి 11 గంటలకు బయలుదేరి చెంగల్పట్టు, విల్లుపురం, చిదంబరం, మైలాడుదురై, కుంభకోణం, తంజావూరు, తిరుచ్చి, దిండిగల్, మదురై, విరుదునగర్, సాత్తూరు, కోవిల్‌పట్టి, నెల్లై, వళ్ళియూర్ మీదుగా మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. తాంబరం నుంచి సోమవారం రాత్రి బయలుదేరిన ఈ రైలు మంగళవారం ఉదయం 6.10 గంటలకు తిరుచ్చికి చేరుకుంది. ఆ సమయంలో ప్రయాణికుల టిక్కెట్లను తనిఖీ చేస్తున్న ఓ టీసీని అదే రైలులో విధులు నిర్వహించిన మదురై డివిజనల్ చీఫ్ టీసీ శరవణన్ సెల్వి అనుమానించి రైల్వేశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చింది. ఆ తర్వాతగుర్తింపు కార్డు ఇవ్వాలని కోరగా, ఆ వ్యక్తి పొంతన లేకుండా సమాధానం చెప్పారు. దీంతో అతన్ని ఆర్పీఎఫ్ సిబ్బందితో సాయంతో అదుపులోకి తీసుకుని విచారించగా, నకిలీ టీసీ అని తేలడంతో రైల్వే పోలీసులు అరెస్టు చేశారు.

## త్వరలో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రాలివే


'లాంతర్'లో విధార్థ్, శ్వేత

చిత్రజ్యోతి

ప్రతి శుక్రవారం కనీసం నాలుగు నుంచి ఆరేడు చిత్రాల వరకు విడుదలవుతుంటాయి. ఈ నెల 21వ తేదీ శుక్రవారం కూడా కొన్ని చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో ఎక్కువగా చిన్న బడ్జెట్ సినిమాలే ఉన్నాయి. 'లాంతర్', 'రెయిల్', 'భయమరియ బ్రహ్మై', 'చట్టం ఎన్ కైయిల్' వంటి స్ట్రైట్ చిత్రాలు ఉండగా, 'పోకిరి', 'తుపాకి', 'గుణ' చిత్రాలను రీరిలీజ్ చేస్తున్నారు. ఇందులో షాజి సలీం దర్శకత్వంలో విధార్థ్, శ్వేత డోరత్తి, విపిన్, సహానా గౌడలు నటించిన 'లాంతర్'పై ఎక్కువగా అంచనాలు ఉన్నాయి. భాస్కర్ శక్తి దర్శకత్వంలో కుంకుమ్ రాజ్, ముత్తుస్వామి, వైరమాల, రమేష్ వైద్య తదితరులు నటించిన 'రయిల్', రాహుల్ కబాలి డైరెక్షన్‌లో జేడీ గురు సోమసుందరం, హరీష్ ఉత్తమన్ తదితరులు నటించిన 'భయమరియ బ్రహ్మై', సాయి తనిష్క నటించిన 'చట్టం ఎన్ కైయిల్' చిత్రం ఈ నెల 21వ తేదీన విడుదలకానున్నాయి. అలాగే, కమల్ హాసన్ 'గుణ', విజయ్ నటించిన 'పోకిరి', 'తుపాకి' సినిమాలను రీరిలీజ్ చేస్తున్నారు. ప్రతి వారం సరాసరి 4 నుంచి 6 స్ట్రైట్ చిత్రాలు విడుదలవుతున్నప్పటికీ వాటిలో విజయం సాధించే చిత్రాలు మాత్రం ఒకటి లేదా రెండు మాత్రమే ఉంటున్నాయి.

## విజయ్ 69వ మూవీ లేనట్టేనా?



అగ్రహీరో విజయ్ 69వ చిత్రం లేనట్టేనని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి కారణం వచ్చే 2026లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పోటీ చేయనుంది. దీంతో పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి అడుగుపెట్టాలన్న సంకల్పంతో విజయ్ ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్టు సమాచారం. అందుకే తన 69వ చిత్రాన్ని పక్కనబెట్టాలన్న ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుంది. ఈ ప్రాజెక్టుకు 'చదురంగ వేట్టై', 'ధీరన్ అధికారం ఒండ్రు', 'నేర్ కొండ పార్వై', 'వలిమై', 'తుణివు' వంటి వరుస హిట్ చిత్రాలను అందిస్తూ, సూపర్ హిట్ డైరెక్టరుగా గుర్తింపు పొందిన హెచ్.వినోద్ డైరెక్ట్ చేస్తారనే ప్రచారం జరిగింది. ప్రస్తుతం తన 68వ చిత్రం 'గోట్' మూవీని వెంకట్ ప్రభు దర్శకత్వంలో నటిస్తున్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఆ తర్వాత పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి రావాలన్న తలంపులో ఉన్నట్టు సమాచారం. ఇందుకోసం ఇప్పటి నుంచే రాష్ట్రస్థాయి పర్యటనలు, మహానాడు, గ్రామ, జిల్లా స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడం, నేతలు, కార్యకర్తలతో సమాలోచనలు, బహిరంగ సభలు వంటి వాటితో క్షణం తీరికలేకుండా గడపాల్సి ఉన్నందున 69వ ప్రాజెక్టును తాత్కాలింగా పక్కనబెట్టాలని విజయ్ ఆలోచన చేస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.

## తీరంలో రమ్య గ్లామర్ ఎక్స్‌పోజింగ్ !



తమిళ చిత్రపరిశ్రమలో ఉన్న కుర్రకారు హీరోయిన్లలో రమ్య పాండియన్ ఒకరు. అటు బుల్లితెర, ఇటు వెండితెరలపై తన ప్రతిభను నిరూపించుకుంటూ మంచి నటిగా గుర్తింపు పొందారు. 'జోకర్' సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆమె సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి ఆమె నడుమే కారణం అంటే అతిశయోక్తి కాదు. అలాగే, తన హృదయ అందాలను ఎక్స్‌పోజ్ చేస్తూ ప్రత్యేకంగా దిగిన ఫోటోలను షేర్ చేస్తూ అభిమానులను ఎన్నో నిద్రలేని రాత్రులను మిగిల్చారు. ముఖ్యంగా ఆమె ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియాల్లో షేర్ చేసే ఫోటోలు ఎంతో వైరల్ అవుతాయి. ఇలా భారీ సంఖ్యలో అభిమాన గణాన్ని సంపాదించుకున్న రమ్య పాండియన్... 2015 నుంచి చిత్రసీమలో కొనసాగుతున్నప్పటికీ వేళ్ళపై లెక్కించదగిన చిత్రాల్లోనే ఆమె నటించారు. కోలీవుడ్‌లో వరుసగా సినీ అవకాశాలు రాకపోవడంతో బిగ్ బాస్ వంటి రియాల్టీ షోలలో కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ఇటు మాతృభాష తమిళంతో పాటు మలయాళంలో కూడా ఆమె నటిస్తూ, బిజీగా ఉన్నారు. అయితే, తనకు గుర్తింపు తెచ్చిన ఎక్స్‌పోజింగ్‌కు మాత్రం ఆమె దూరం కావడం లేదు. తాజాగా సముద్రతీరంలో చీకట్లులో ఆమె అందాలు ఆరబోస్తూ దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

## ప్రభుదేవా - ఏఆర్.రెహ్మాన్ కాంబోలో 'మూన్‌వాక్'



బిహైండ్‌వుడ్స్ సమర్పణలో ప్రభుదేవా, ఏఆర్ రెహ్మాన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమాకు 'మూన్‌వాక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఎన్నో ఘన విజయాలను సొంతం చేసుకున్న ఏఆర్.రెహ్మాన్, ప్రభుదేవా కాంబో మళ్లీ 25 యేళ్ల తర్వాత కలిసి పనిచేస్తుంది. ఏఆర్ఆర్‌పీడీ6 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్ళగా, ప్రస్తుతం ఈ సినిమా రెండో షెడ్యూల్ చెన్నై నగరంలో శరవేగంగా జరుపుకుంటుంది. వినోదాత్మక అంశాలతో వినోదాత్మక కుటుంబ సభ్యులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందే ఈ చిత్రంలో ప్రభుదేవా, యోగిబాబు, అజు వర్గీస్, అర్జున్ అశోకన్, చాట్స్, నిషా సుష్మిత తదితరులు నటిస్తున్నారు. బిహైండ్‌వుడ్స్ సమర్పణలో మనోజ్ ఎన్ఎస్, దివ్య మనోజ్, ప్రవీణ్ ఇలాక్‌లు నిర్మించే ఈ చిత్రానికి బిహైండ్‌వుడ్స్ కంపెనీ సీఈవో మనోజ్ ఎన్ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు.

## చెన్నై నుంచి కన్నియాకుమారి దాకా
# 'సాగర్‌కవచ్' విన్యాసాలు





మెరీనాబీచ్ వద్ద సాగర్‌కవచ్ విన్యాసాల కోసం బయలుదేరుతున్న పోలీసులు

కూడంకుళంలో ఉగ్రవాదుల వేషంలో ఉన్నవారి నిర్బంధిస్తున్న కోస్ట్‌గార్డ్ సభ్యులు


నాగపట్టినంలో ఉగ్రవాదుల కదలికలపై నిఘా వేస్తున్న పోలీసులు


పుదుచ్చేరి సముద్రతీరంలో పోలీసుల నిఘా

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 'సాగర్‌కవచ్' విన్యాసాలు ప్రారంభమయ్యాయి. రాజధాని నగరం చెన్నై నుంచి కన్నియాకుమారి దాకా ఈ విన్యాసాలు గురువారం సాయంత్రం ఆరుగంటల వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ విన్యాసాల్లో 8500 మంది పోలీసులు పాల్గొంటున్నారు. 2008లో ముంబాయిలో సముద్రమార్గంలో చొరబడిన పాకిస్థాన్ ఉగ్రవాదులు హింస్మాతక సంఘటనలకు పాల్పడిన నేపథ్యంలో ప్రతియేటా సముద్రతీర ప్రాంతాల్లో 'సాగర్‌కవచ్' పేరుతో ఉగ్రవాద నిరోధక చర్యలపై విన్యాసాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు సముద్రతీర ప్రాంతాల్లో బుధవారం ఉదయం కోస్ట్‌గార్డ్ సభ్యులు, రాష్ట్ర సముద్రతీర భద్రతా విభాగం పోలీసులు సంయుక్తంగా ఉగ్రవాద నిరోధక విన్యాసాలు ప్రదర్శించారు. చెన్నై నుంచి మహాబలిపురం సముద్ర తీరం దాకా బుధవారం ఉదయం సాగర్ కవచ్ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. వేకువజామునే ఉగ్రవాదుల వేషధారణతో కొంతమంది పోలీసులు నాటు పడవలు, ఫైబర్ పడవలలో సముద్రంలో రెండు మూడు నాటికల్ మైళ్ళ దూరంలో దాగారు. వారిని అన్వేషిస్తూ గస్తీ నౌకల్లో కోస్ట్‌గార్డ్ సభ్యులు, రాష్ట్ర సముద్రతీర భద్రతాదళం సభ్యులు సముద్రం నలుమూలల గాలించి ఉగ్రవాదుల వేషధారణలో ఉన్నవారిని నిర్బంధంలోకి తీసుకున్నారు. కాశిమేడు చేపలరేవు, బిసెంట్‌నగర్ సముద్రతీరం తదితర ప్రాంతాల్లో ఈ విన్యాసాలు జరిపారు.

### మహాబలిపురంలో...

ప్రముఖ చారిత్రక నగరం మహాబలిపురం సముద్రతీరంలోనూ సాగర్‌కవచ్ విన్యాసాలు భారీ ఏర్పాట్ల నడుమ ప్రారంభమయ్యాయి. మహాబలిపురంలోని ప్రాచీన శిల్ప సంపదపై దాడులు జరిపేందుకు ఉగ్రవాదుల వేషాల్లో ఉన్నవారు నాటుపడవలలో తీరానికి రావటం, ఆ సమయంలో అ ప్రాంతంలోనే నిఘా వేసిన పోలీసులు, కోస్ట్‌గార్డ్ సిబ్బంది వారిని నిర్బంధంలోకి తీసుకున్నారు.

### తిరునల్వేలి, తూత్తుకుడిలో...

తిరునల్వేలి, తూత్తుకుడి, రామనాథపురం, నాగపట్టినం తదితర సముద్రతీర ప్రాంతాల్లో ఉగ్రవాదుల చొరబాటు నిరోధక విన్యాసాలు జరిపారు. తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో రెండు రోజుల సాగర్‌కవచ్ విన్యాసాలు ప్రారంభమయ్యాయి., తిరునల్వేలి జిల్లా కూడంకుళం అణువిద్యుత్ కేంద్రం సమీపంలో సముద్రతీరంలో కోస్ట్‌గార్డ్, రాష్ట్ర సముద్రతీర భద్రతాదళం పోలీసులు కలిసికట్టుగా ఉగ్రవాదుల చొరబాటు నిరోధక విన్యాసాలు జరిపారు. ఈ విన్యాసాలకు కూడంకుళమ్ సముద్రతీర భద్రతాదళం పోలీసులు, ఉవరి, కూడంకుళం శాంతి భద్రతల విభాగం పోలీసులు, మత్స్యశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సహాయ సహకారాలు అందించారు. బుధవారం వేకువజామును ఉగ్రవాదుల వేషాల్లో కొందరు మరపడవలలో సముద్రంలో నలుదిక్కులా దాగారు. ఆ తర్వాత వారు సముద్రతీరంలో చొరబడేందుకు ప్రయత్నించడం, వారిని కోస్ట్‌గార్డ్ అధికారులు, పోలీసులు కలిసి నిర్బంధించడం వంటి విన్యాసాలు సాయంత్రం వరకూ కొనసాగాయి. ఇదే విధంగా కొంత మంది జాలర్ల వేషాలు ధరించిన ఉగ్రవాదులో తీరంలో చొరబాటు యత్నానికి పాల్పడ్డారు. వీరిని సాయుధ పోలీసుల నిర్బంధంలోకి తీసుకున్నారు. ఇదే రీతిలో చెక్‌పోస్టుల వద్ద ఉగ్రవాదుల చొరబటు నిరోధక చర్యలను కూడా పోలీసులు చక్కగా ప్రదర్శించారు.

### వేదారణ్యంలో...

నాగపట్టినం జిల్లా వేదారణ్యం సముద్రతీర ప్రాంతాల్లోనూ కోస్ట్‌గార్డ్ సభ్యులు, రాష్ట్ర సముద్రతీర దళం పోలీసులు సంయుక్తంగా రెండు రోజుల సాగర్ కవచ్ విన్యాసాలను ప్రారంభించారు. కోస్ట్‌గార్డ్ డీఎస్పీ సుందర్ నాయకత్వంలో సబ్ ఇన్‌స్పెక్టర్ వలక్ష్మి, ఏఎస్ఐ శశికుమార్ పర్యవేక్షణలో సుమారు 40 మందికి పైగా పోలీసులు నాలుగు జట్లుగా విడిపోయి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ విన్యాసాల కోసం కొంతమంది సిబ్బందిని ఉగ్రవాదుల వేషాల్లో బుధవారం వేకువజామునే సముద్రతీర ప్రాంతాల్లో దాక్కునేలా చేశారు. వారి ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్, పోలీసులు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు.

### పుదుచ్చేరిలో...

పుదుచ్చేరి సముద్రతీర ప్రాంతాల్లోనూ బుధవారం ఉదయం ఆరుగంటలకు సాగర్ కవచ్ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. ఉగ్రవాదుల చొరబాటును అడ్డుకునే కార్యకలాపాలను నిర్వహించారు. పుదుచ్చేరి జాలర్ల నివాసప్రాంతాలైన కాలాపట్టు, పుదుకుప్పం, వీరాంపట్టినం తదితర 16 గ్రామాలలోనూ ఈ విన్యాసాలను ప్రదర్శించారు. కడలిలో మరపడవల ద్వారా చొరబడేందుకు ఉగ్రవాదుల వేషాల్లో ఉన్నవారిని గస్తీ నౌకల ద్వారా వెళ్ళి నిర్బంధించడం, సుదూర ప్రాంతాల్లో వస్తున్న నౌకలను టెలిస్కోపు, బైనాక్యులర్ తదితర పరికరాల ద్వారా గుర్తించడం, వెంటనే వేగంగా వెళ్ళి వాటిని చుట్టుముట్టడం వంటి విన్యాసాలు నిర్వహించారు. వీరి విన్యాసాలను చూసి తీర ప్రాంతాల్లో ఉన్న జాలర్ల కుటుంబీకులు విస్తుపోయారు. ఆ తర్వాత ఆ విన్యాసాలన్నీ సాగర్‌కవచ్ విన్యాసాలని తెలుసుకుని ఊరట చెందారు.

## అన్నప్రసాదంలో నాణ్యతను మరింత మెరుగుపరచండి

### అధికారులతో టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టీటీడీ అన్నప్రసాద విభాగ కార్యకలాపాలను బుధవారం ఈవో సమీక్షించారు. టీటీడీలోని ప్రతి విభాగం పనితీరుపై తెలుసుకోవడంలో భాగంగా తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మంతో కలిసి అన్నప్రసాద విభాగాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఈవో సుదీర్ఘంగా సమీక్షించారు. తిరుమలలో వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని అక్షయ కిచెన్, పీఏసీ2తో పాటు ఉద్యోగుల క్యాంటీన్, పద్మావతి అతిథి గృహం సహా తిరుమలలోని అన్నప్రసాదాలు తయారు చేసే ప్రదేశాలపై ఈవో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి తాత్కాలికంగా నిలిపివేసిన పాంచజన్యం వంటశాలను త్వరగా ప్రారంభించేలా చూడాలని అన్నప్రసాదం, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుమలలో సగటున రోజుకు 1.75 లక్షల మంది అన్నప్రసాదాలు స్వీకరిస్తుండగా, తిరుపతిలో 17 వేలు, వారంతాల్లో తిరుమలలో 1.95 లక్షలు, తిరుపతిలో 19 వేల మంది అన్నప్రసాదాలు స్వీరిస్తున్నట్టు అధికారులు ఈవోకు వివరించారు. భక్తులకు అందజేస్తున్న మజ్జిగలో నాణ్యత పెంచాలి, వంట చేసే స్థలం ఆవరణను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలని సూచించారు. ఆహారపదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఫుడ్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా సిబ్బందిని పెంచడం, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా దశాబ్దాల నాటి యంత్రాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడం, అన్నప్రసాదం నాణ్యతను పెంచేందుకు ఫుడ్ కన్సల్టెంట్‌ను నియమించడం వంటి అంశాలకు సంబంధించి వీలైనంత త్వరగా అమలు చేసేందుకు పక్కా కార్యచరణ ప్రణాళికతో ముందుకు రావాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు. ఈసమీక్షలో డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ జీఎల్ఎన్ శాస్త్రి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరుములు మెరుపులతో వర్షం

### రెండో రోజూ విమాన సేవలకు అంతరాయం

అడయార్, జూన్ 19 : గ్రేటర్ చెన్నై, నగర శివారు ప్రాంతాల్లో రెండో రోజైన బుధవారం తెల్లవారుజామున కూడా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అందువల్ల నగరంలోని జాతీయ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో టేకాఫ్, టేకాన్ కావాల్సిన 26 విమానాల సేవలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా నగరంలో రాత్రిపూట అకస్మాతుగా భారీ వర్షపు జల్లులు కురుస్తున్నాయి. ఈ కారణంగా ముంద జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో నగరవాసులు ఉక్కపోతతో తల్లడిల్లుతూ జాగారం చేస్తున్నారు. రెండో రోజైన బుధవారం కేరళలోని కోళికోడ్ నుంచి 70 మంది ప్రయాణికులతో దిగాల్సిన విమానం, ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం, తదితర 12 ఫ్లైట్స్ ల్యాండ్ కాలేక గాల్లోనే చక్కర్లు కొట్టారు. అదేవిధంగా మదురై, ముంబై, కోవై, ఢిల్లీ, హైదరాబాద్, గోవా, వారణాసి తదితర ప్రాంతాలకు వెళ్ళే విమాన సేవలకు కూడా అంతయారం ఏర్పడింది. అలాగే, అంతర్జాతీయ విమానాశ్రయంలో దుబాయ్, కువైట్, సింగపూర్, కౌలాంపూర్, అబుదాబి, బ్యాంకాక్ తదితర దేశాలకు వెళ్ళాల్సిన మరో 14 విమానాలు వాతావరణం అనుకూలించని కారణంగా రాత్రి ఆలస్యంగా బయలుదేరి వెళ్ళాయి.

### నీలగిరి జిల్లాను ముంచెత్తిన భారీ వర్షం

ప్రముఖ పర్యాటక ప్రాంతం, వేసవి విడిది కేంద్రంగా గుర్తింపు పొందిన నీలగిరి జిల్లాలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. గూడలూరు ప్రాంతంలో కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులు జలమయంకాగా, 30కి పైగా గృహాల్లోకి వర్షపునీరు వచ్చి చేరింది. గూడలూరులో మంగళవారం సాయంత్రం దాదాపు 2 గంటల పాటు మోస్తరు వర్షం కురిసిన కారణంగా ఈ ప్రాంతంలో ఉన్న చెరువుల్లో నీటి మట్టాలు పెరిగాయి. లోతట్టు ప్రాంతాలు, వ్యవసాయ భూముల్లో వర్షపునీరు వచ్చి చేరింది. సిట్రార్ వాగులో ఏర్పడిన వరద ప్రవాహానికి పరిసర ప్రాంతాల్లో ఉన్న గృహాల్లో వర్షపునీరు చేరడంతో ఇంటిలోని సామాగ్రి అంటా నీట మునిగిపోయింది. అలాగే, అనేక పొలాల్లో చేతికొచ్చిన పంట నీట మునిగిందని రైతులు వాపోతున్నారు. సిట్రారు వాగులో తరచుగా వరద ప్రవాహం ఏర్పడుతున్నందున తీవ్రంగా నష్టపోతున్నామని, గత రెండేళ్ళ క్రితం పూడికతీత పనులు చేపట్టారని, అయితే, వర్షం కురవని రోజుల్లో ఈ వాగులో మళ్ళీ పూడికతీత పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

## పోక్సో వెబ్‌సైట్ ప్రారంభం



ఐసిఎఫ్, జూన్ 19: పోక్సో వెబ్‌సైట్‌ను రాష్ట్ర క్రీడాభివృద్ధి, యువజన సంక్షేమ శాఖ మంత్రి ఉదయనిధి లాంఛనంగా ప్రారంభించారు. లైంగిక నేరాలకు గురైన పిల్లల కోసం https://www.pocsoportal.gov.in అనే వెబ్‌సైట్ వ్యక్తిగత సంరక్షణ ప్రణాళిక యాప్, పిల్లల సంరక్షణ గృహాలను పరిశోధించడానికి ఒక యాప్, హ్యాండ్‌మెయిడ్స్ మరియు నిరుపేద మహిళా సంక్షేమ బోర్డు సభ్యత్వం కోసం www.tnwidowwelfareboard.tn.gov.in వెబ్‌సైట్‌ను మంగళవారం సాయంత్రం మంత్రి ఉదయనిధి లాంఛనంగా ప్రారంభించారు.

## ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ బస్ సేవలు ప్రారంభం



సేవలు ప్రారంభిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

అడయార్, జూన్ 19: ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ కోసం బస్ సేవలను వీఎస్ వెల్‌నెస్ ఆన్ వీల్స్ పేరుతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. మంత్రి నివాసంలో జరిగిన ఓ వేడుకలో వెల్‌నెస్ ఆన్ వీల్స్ సేవలకు మంత్రి జెండా ఊపారు. వీఎస్ వెల్‌నెస్ ఆన్ వీల్స్ ద్వారా కేన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ క్యాంపులను పేదలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకొస్తుందని మంత్రి తెలిపారు. ఇలాంటి సేవలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వీఎస్ మెడికల్ ట్రస్ట సేతృత్వంలో రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ సహకారంతో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు మంత్రి వివరించారు.

## 23న నెలనెలా వెన్నెల

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి' ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక కార్యక్రమం 'నెల నెలా వెన్నెల' జరుగనుంది. సమితి మాజీ ప్రధాన కార్యదర్శి దివంగత వై.రామకృష్ణ 81వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి సమితి అధ్యక్షులు డాక్టర్ అజంతా కె.శంకరరావు అధ్యక్షత వహించనుండగా, ముఖ్య అతిథిగా రిటైర్డ్ రేడియాలజిస్ట్ డాక్టర్ పళనియప్పన్, గౌరవ అతిథులుగా అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు కె.అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ దేవి మీనల్, డాక్టర్ నెల్లైకుమార్, డాక్టర్ రెంటాల జయదేవ హాజరు కానున్నారు. ప్రముఖ గాయని ఘంటసాల సావిత్రి ప్రార్థనా గీతంతో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమాన్ని డీఆర్‌బీసీసీ హిందూ కళాశాల తెలుగు సహాయాచార్యులు డాక్టర్ తుమ్మపూడి కల్పన నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మైలాపూర్ లజ్‌లో వున్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో జరుగనున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## పాండీబజార్‌లో తనిష్క్ షోరూం

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ పాండీబజార్‌లో తనిష్క్ షోరూం ఏర్పాటైంది. ఇది తమిళనాడులో 59వ స్టోర్ అని నిర్వాహకులు ప్రకటించారు. అంతేగాక దేశంలోనే మొట్టమొదటి లగ్జరీ హీలియోస్ స్టోర్ కావడం విశేషం. టైటాన్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సీకే వెంకటరామన్ ఈ షోరూంను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. సాంస్కృతిక కేంద్రంగా, కీలక వృద్ధి మార్కెట్‌గా వున్న చెన్నైలో తమ రిటైల్ ఫుట్‌ప్రింట్‌ను విస్తరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

